క్లుప్తంగా

బాలుర హాస్టల్ పరిశీలన



బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: నగరంలోని బాలాజీ చెరువు సెంటర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్, సాంఘిక సంక్షేమ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆవరణలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వసతి గృహంలో రూ.29.75 లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులను, రూ.95 లక్షలతో నిర్మించిన కిచెన్, డైనింగ్ హాలు నిర్మాణ పనులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అధికారులు మరింత దృష్టి పెట్టి, చివరి దశ పనులను సకాలంలో పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అవసరమైన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ ఆర్ జయరావు, డీఈ కె.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవీ అర్చనకు ఎస్వీయూ డాక్టరేట్



కాకినాడ లీగల్: ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు గోదావరి జిల్లా ప్రభుత్వ గ్రంథాలయ సంస్థలో సమాచార అక్షరాస్యత నైపుణ్యాలు అనే అంశంపై నగరానికి చెందిన మల్లిమొగ్గల దేవీ అర్చన సిద్ధాంత వ్యాసం రచించారు. డాక్టర్ కొంగర సురేంద్రబాబు పర్యవేక్షణలో దీనిని సమర్పించగా, తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఆమోద ముద్ర వేసి డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా దేవీ అర్చనను పలువురు అభినందించారు.

దివ్యాంగ బాలికల ఆశ్రమానికి కెనరా బ్యాంక్ వితరణ



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

బాలాజీచెరువు: మహర్షి సాంబమూర్తి దివ్యాంగ బాలికల ఆశ్రమ పాఠశాలకు సోమవారం కెనరా బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం చేయూతనిచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరివర్తన అనాథ ఆశ్రమం, మహర్షి సాంబమూర్తి దివ్యాంగ బాలికల పాఠశాల, మానవనీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆయా సంస్థలకు అవసరమైన వంట సామగ్రి, నిత్యావసరాలు అందజేసి, భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బూల సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ముసాలమ్మ, సోమాలమ్మ తీర్థం

కరప: వాకాడ గ్రామ దేవతలు ముసాలమ్మ, సోమాలమ్మ జాతర, తీర్థం మూడో రోజైన సోమవారంతో ముగిసింది. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర, తీర్థం ఘనంగా నిర్వహించారు. చివరి రోజున భక్తులు తరలి వచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు గరగ నృత్యాలతో, తీన్మార్ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరి చివరకు తీసుకెళ్లి గుడిపక్కన వేపచెట్టు వద్ద యథాస్థానంలో ఉంచారు. వాకాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

సామాజిక పరిస్థితులపై అవగాహన ఉండాలి

బాలాజీచెరువు: సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులు సామాజిక పరిస్థితులతో పాటు, వ్యాపార రంగాలపై అవగాహన ఉండాలని క్రిఫీ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎండీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ క్వాంటం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సాంకేతికత క్వాంటమ్ భౌతిక సూత్రాలపై ఆధారపడి ఉంటుందని, దీని ద్వారా వేగవంతమైన గణనలు సాధ్యమవుతాయని వివరించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈఆవీఎల్ నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కరప: వేసవి కాలంలో ప్రతి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డీఎల్పీఓ టి.అన్నామణి అన్నారు. నడకుదురు పంచాయతీ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేగల లలితకుమారి, సిబ్బందితో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి డీఎల్పీఓ సూచనలు చేశారు.



రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్



అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో..



తిమ్మాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ తదితరులు



రమణయ్యపేట ఇందిరానగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుక

వాడవాడలా పండగలా..

- ఘనంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి
- రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘన నివాళులు

కాకినాడ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని కాకినాడ రూరల్ నియోజకవర్గ ప్రజలు పండగ వాతావరణంలో జరుపుకొన్నారు. వాడవాడలా అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించి, ఆ మహనీయుడిని స్మరించుకున్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ ఎస్సీ నాయకుడు చిల్లి దేవరాజు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా అంబేడ్కర్ నిలిచిపోయారని వారు కొనియాడారు. రాజ్యాంగ ఫలాలను యావత్ జాతి అనుభవిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెనుమళ్ల ధర్మరాజు, మోకా కృష్ణంరాజు, తర్లంపూడి నాని, గోపుశెట్టి బాబ్జీ, పుల్ల చందు, పెదపాటి నాగబాబు, అనుసూరి ప్రభాకర్, తోటకూట శ్రీనివాస్, కరీం బాషా, చక్రి తదితరులు పాల్గొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు తదితరులు నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కుమారి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సతీష్ తదితరులు, నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ తదితరులు నివాళులర్పించారు. తిమ్మాపురం ఎస్సీ పేటలో ఎమ్మెల్యే పంతం నానాజీ నివాళులర్పించారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు గ్రామంలో పలుచోట్ల అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. సర్పవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో గ్రామంలో పలుచోట్ల అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రమణయ్యపేట ఇందిరా నగర్‌లో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు, గగారిన్ తదితరులు డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రమణయ్యపేట ఏపీఎస్పీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ సర్పంచ్ రత్నప్రసాద్, ప్రసాద్‌నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.



రమణయ్యపేట ఏపీఎస్పీలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కరప: సమాజంలో అసమానతలు తొలగించేందుకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో శ్రమించారని, ఆ మహనీయుడు చిరస్మరణీయుడని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మండల ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు మాట్లాడుతూ, భావితరాల్లో స్ఫూర్తి నింపేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మండల ఎస్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు పులపకూర శుభామహేష్, మారెళ్ల వెంకటరమణ, సాదే లోహిదాస్, మాతా అప్పారావు, వజ్రపు కామేశ్వరరావు, సవిలే రాజేష్, చింతా బుజ్జి, సక్కా సత్తిబాబు, దేవిశెట్టి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కరప శివారు రామకంచిరాజు నగర్‌కాలనీలో బేడ, బుడగ జంగం సంఘ నాయకులు బైలపాటి నూకరాజు, పెద్దగొలుసులు చెన్నారావు, మరిడియ్య, వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలో సర్పంచ్ ఆశాజ్యోతి, కరప ఎస్సై టి.సునీత, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొని, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జి.భావారంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వేళంగిలో సర్పంచ్ సవిలే నీలిమ, కార్యదర్శి పి.వీరభద్రరావు అంబేడ్కర్ జయంతిని, గ్రామసభను నిర్వహించారు. పెద్దాపురప్పాడులో భీమ్‌రావు సిద్ధార్థ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ పి.మధుసునీల్, కె.షెకెము తదితరులు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, నాగిరెడ్డి ఏసురత్నం, బొమ్మిడి నయోమి, కొత్త నాగలక్ష్మి, అడబాల సత్య, దేగల లలితకుమారి, కమిడి మంగాదేవి, చింతా నాగలక్ష్మి, వెలుగుబంటి రాఘవ, పలివెల నాగేశ్వరరావు, నున్న సుజాత, మారెళ్ల శివ, గోపి సత్యవేణి, సక్కా బాబులు, బిరుదా సరస్వతి తదితరులు నివాళులర్పించారు. నడకుదురులో అంబేడ్కర్‌కు దాలిపర్తి శ్రీనివాస్ నివాళులర్పించారు. కొన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. పెద్దాపురప్పాడులో అంబేడ్కర్ యువజన సేవా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు ప్రారంభించారు. గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

ఏపీ ఎన్జీవో హోమ్‌లో..

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని స్థానిక ఏపీ ఎన్జీఓ హోమ్‌లో ఎన్జీవో సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ గుద్దటి రామమోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ నాయకులు పసుపులేటి శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, వై పద్మమీనాక్షి, అరదాడి సత్తిరాజు, వై రామకృష్ణ, సత్యమూర్తి, చార్లెస్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి యూటీఎఫ్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కచేరిపేటలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పిలుపుమేరకు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జె.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రాగుల రాఘవులు, బంగారు సత్యనారాయణ కె.నరసింహ, బొడ్డు సత్యనారాయణ, జి.దుర్గారావు, ఎల్లారం, చంద్రరావు, తాతారావు, వడ్డీకాసులు, మహేష్, సాయి, బంగార్రాజు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి అనిసెట్టి బుల్లబ్బాయిరెడ్డినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, పలువురు దళిత నాయకులు నివాళులు అర్పించారు.

ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ముస్లిం జాక్ కన్వీనర్ ఎజాజుద్దీన్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ, దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనికి వ్యతిరేకంగా బుధవారం స్థానిక మసీద్ సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రజా సామ్యవాదులు, ప్రజా సంఘాల వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర మాజీ డైరెక్టర్లు అబ్దుల్ బషీరుద్దీన్, అక్మల్ హుస్సేన్, అహ్మద్, ఫరూక్, గులాం రసూల్, ఖాజా తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా స్థానిక ఇంద్రపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు నివాళులర్పించారు.



ఎన్జీవో హోంలో అంబేడ్కర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నేతల నివాళులు



అంబేడ్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముస్లిం ప్రజా సంఘాల సభ్యులు



కరపలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, మండల ఎస్సీ, వైఎస్సార్ సీపీ నేతలు



కరప మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీడీఓ తదితరుల నివాళులు



రామకంచినగర్ కాలనీలో బేడ, బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో..



పెద్దాపురప్పాడులో భీమ్‌రావు సిద్ధార్థ సంఘ నాయకుల ఆధ్వర్యంలో..



వేళంగి పంచాయతీలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

అంబేడ్కర్ చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా జడ్జి హరినారాయణ

కాకినాడ లీగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ అన్నారు. స్థానిక కాకినాడ బార్ అసోసియేషన్ హాలులో డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి హరినారాయణ మాట్లాడుతూ, వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించిన అంబేడ్కర్.. మన దేశంలో బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో బలమైన రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. మహనీయులు చేసిన త్యాగాలు వృథా కాకుండా దేశాభివృద్ధి కోసం పనిచేయాలని న్యాయవాదులకు సూచించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్, న్యాయమూర్తులు, న్యాయవాదులు నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యురాలు ఎ.శ్రీదివ్య కుమార్తె మహన్విత కాకినాడ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో 2024లో టెన్త్ పరీక్షల్లో 561 మార్కులు సాధించింది. ఆమెకు బార్ అసోసియేషన్ తరఫున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెరిట్ స్కాలర్‌షిప్ రూపేణా రూ.5,046 నగదు, సర్టిఫికెట్‌ను జిల్లా జడ్జి హరినారాయణ, సంఘ ప్రతినిధులు అందజేశారు.



మహన్వితకు నగదు, సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా జడ్జి హరినారాయణ తదితరులు

'ఫ్రమ్ ది ఎర్త్ టు ది స్కై' పుస్తకావిష్కరణ

కాకినాడ సిటీ: నగరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఈశ్వరమ్మ జీవిత చరిత్ర 'ఫ్రమ్ ది ఎర్త్ టు ది స్కై' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఏడీ గంధం చంద్రుడు, రాష్ట్ర అకౌంటెంట్ ఆడిటర్ జనరల్ శాంతిప్రియ, ఈశ్వరమ్మ కుమారుడు మేఘాలయ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంపత్‌కుమార్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు, పాఠశాల విద్య ఆర్‌జేడీ జి.నాగమణి తదితరులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు, పూర్వ విద్యార్థులు కలిసి ఈశ్వరమ్మను ఘనంగా సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజశేఖర్, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కుప్పకూలిన పార్కింగ్ షెడ్డు

కాకినాడ క్రైం: నగరంలో ఆదివారం రాత్రి వీచిన పెనుగాలుల ధాటికి జీజీహెచ్‌లో ఓ షెడ్డు కుప్పకూలింది. క్యాన్సర్ వార్డు ఎదురుగా, డంప్ యార్డ్ పక్కన ఉన్న ఈ షెడ్డును పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. గాలుల బీభత్సానికి భూమిలో ఉన్న షెడ్డు స్తంభాలు వంగిపోయాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఈ షెడ్డును పరిశీలించారు. ఆదివారం, రాత్రివేళ కావడంతో వాహనాలు తక్కువగా ఉండడం వల్ల పెద్దగా నష్టం వాటిల్లలేదు.



జీజీహెచ్‌లో కూలిన పార్కింగ్ షెడ్డు

దేశ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర కీలకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భారత దేశ నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌రాజు కొనియాడారు. జేఎన్‌టీయూకేలో సోమవారం డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. వర్సిటీ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, లైజన్ ఆఫీసర్ కుమారస్వామి, వర్సిటీ అధ్యాపకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్పీ బిందుమాధవ్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశానికి దశ, దిశను చూపిన మహనీయుడని ఎస్పీ కొనియాడారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఐ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. రంగరాయ వైద్య కళాశాలలో అంబేడ్కర్ జయంతి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ మధుమేహ వ్యాధుల నిపుణుడు రామస్వరూప్ జవహర్ హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎంపీఆర్ విఠల్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొని డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆస్పత్రి ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళుర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి



జేఎన్‌టీయూకేలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు

కాకినాడ సిటీ: నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ, ఆశా వర్కర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఈశ్వరి, సీహెచ్ పద్మ నివాళులర్పించారు. పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' సందడి

బోట్‌క్లబ్: నగరంలోని తిరుమల థియేటర్‌లో అక్కడ అమ్మాయి,, ఇక్కడ అబ్బాయి చిత్ర యూనిట్ సందడి చేసింది. సోమవారం ఉదయం ప్రదర్శనకు చిత్ర నటీనటులు, కథా నాయకుడు ప్రదీప్ మాచిరాజు, కథా నాయకి దీపిక పిల్లితో పాటు, దర్శకులు నితిన్, భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర కథా నాయకుడు ప్రదీప్ మాట్లాడుతూ, చిత్రం పూర్తి స్థాయిలో వినోదాత్మకంగా ఉంటుందన్నారు. అందువల్ల ఇటువంటి చిత్రాన్ని ప్రోత్సహించి పరిశ్రమ అభివృద్ధి సహకరించాలని ప్రేక్షకులను కోరారు. రివ్యూలు, రేటింగుల కంటే ప్రేక్షకుల చప్పట్లే తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని చెప్పారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను థియేటర్ యాజమాన్యం, పంపిణీదారులు సన్మానించారు. ఈ చిత్రానికి ఆదరణతో పాటు వసూళ్లు కూడా బాగా పెరుగుతున్నాయని యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది.



ప్రేక్షకులతో మాట్లాడుతున్న సినీ హీరో ప్రదీప్ మాచిరాజు

హాస్టల్‌కు వితరణ



హాస్టల్‌కు వాటర్ కూలర్, ఫ్యాన్లు అందజేస్తున్న ఆర్ఎం, ఉద్యోగులు

నాగమల్లితోట జంక్షన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌బీఐ స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహానికి రూ.50 వేల విలువైన వాటర్ కూలర్‌ను, సీలింగ్ ఫ్యాన్లను అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ కాకినాడ రీజనల్ మేనేజర్ శ్రీతపోదన్, బ్యాంకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకులు కె.యశ్వంత్, ప్రతీక్, సందీప్, భరత్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓలుగా హోదా మార్పు

కరప: ఈఓ పీఆర్ అండ్ ఆర్డీల హోదాను డిప్యూటీ ఎంపీడీఓలుగా మార్పు చేస్తూ ఈ నెల 7న ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలైనట్టు డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓల పదోన్నతిలో డిప్యూటీ ఎంపీడీఓలకు 60 శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు.